క్లుప్తంగా

విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

సీతమ్మధార : ఇంటర్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని డీఈవో చంద్రకళ అన్నారు. పీఅండ్‌టీ కాలనీలోని ఎస్‌ఎంసీహెచ్ ప్లస్ స్కూల్‌లోని మొదటి సారిగా ఇంటర్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులతో డీఈవో మాట్లాడారు. పరీక్షలకు సంబంధించిన సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాంప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



విద్యార్థినికి మాత్ర మింగిస్తున్న డాక్టర్ పేడాడ జగదీశ్వరరావు

సీతమ్మధార : జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా పీఅండ్‌టీ కాలనీలోని ఎస్‌ఎంసీహెచ్ స్కూల్‌లో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.పేడాడ జగదీశ్వరరావు పాల్గొని విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలసురక్ష ప్రాజెక్టు అధికారిణి డా.ఎస్. సమత, వైద్యాధికారిణి డా.మానస్వి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



గరుడవాహనంపై స్వామివారు ఊరేగింపు

మర్రిపాలెం : 51వ వార్డు అప్పయ్యనగర్‌లోని శ్రీ,భూ సమేత విజయ వేంకటేశ్వర స్వామివారి 31వ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈమేరకు వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ఉభయదేవేరులతో తప్పెటగుళ్లు, నాదస్వరం బృందాలతో భక్తులు, అర్చకులు వేదపండితుల నడుమ తిరువీధుల్లో గరుడవాహనం, గజవాహనం, హనుమంత వాహనాలపై ఊరేగించారు. ఈ ఉత్సవంలో మెట్ట దమయంతి, నమ్మి నాగేశ్వరరావు, శ్యామ్, గణేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జైలు ఆవరణలో జిమ్ పరికరాలు ఏర్పాటు



పరికరాలను ప్రారంభిస్తున్న జైళ్ల శాఖ ఐజీ శ్రీనివాస్

ఆరిలోవ: సింబయాసిస్ కంపెనీ అధినేత ఒ.నరేష్‌కుమార్ సహకారంతో విశాఖ కేంద్ర కారాగారం ఆవరణలోని ఉద్యోగుల క్వార్టర్స్‌లో జిమ్ పరికరాలు ఏర్పాటు చేశారు. వీటిని జైళ్ల శాఖ ఐజీ ఇండ్ల శ్రీనివాస్ సింబయాసిస్ అధినేతతో కలసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలన్నారు. పరికరాలు ఏర్పాటు చేసిన నరేష్‌కుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ ఎస్.రాహుల్, అధికారులు పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం



గొల్లకంచరపాలెం రైల్వేట్రాక్ రహదారిలో భవన నిర్మాణ సామగ్రి

- రహదారులపై భవన నిర్మాణ వ్యర్థాలు
- జనం ఇబ్బందులు పట్టించుకోని నిర్మాణదారులు
- అధికారుల తీరూ అంతే..

కంచరపాలెం : నలుగురు వినియోగించే రహదారుల్లో భవన నిర్మాణ సామగ్రి డంప్‌చేస్తున్నారు. కనీసం ప్రజల ఇబ్బందులను కూడా పట్టించుకోకుండా నిర్మాణదారులు వ్యవహరిస్తున్నారు. సంబంధిత అధికారులు కూడా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

జీవీఎంసీ 47,48, 54,56,57 వార్డు పరిధిలో కంచరపాలెం, ఊర్వశికూడలి, ఐటీఐ జంక్షన్ , 104 ఏరియా, ఇండస్ట్రీయల్ ఎస్టేట్, మర్రిపాలెం పలు ప్రాంతాల్లో రహదారికి అడ్డంగా భవన నిర్మాణ సామగ్రిని వేస్తుండడంతో రాకపోకలకు వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంచరపాలెం మెయిన్‌రోడ్డు, దుర్గానగర్, గొల్లకంచరపాలెం, తోటవీధి, గవర కంచరపాలెం, రామ్మూర్తిపంతులుపేట, మల్లసూరివీధి, శ్యామ్‌నగర్, సుభాష్‌నగర్, గౌరీనగర్, రెడ్డికంచరపాలెం, కప్పరాడ, రాంజీ ఎస్టేట్, కప్పరాడ, ఇందిరానగర్, బర్మాక్యాంప్, జైభారత్‌నగర్, అరుంధతినగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారుల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. ఈ ప్రాంతాల్లో కొంత మంది వ్యక్తులు భవనాలు నిర్మిస్తున్నారు. వీధుల్లో భవన నిర్మాణాలకు అవసరమైన ఇసుక, పిక్క, ఇటుక వంటి సామగ్రిని తీసుకువచ్చి రోడ్ల మీద ఇష్టానుసారంగా వేస్తున్నారు. అంతేగాక వాటికి సంబంధించిన పనులు కూడా అక్కడే చేపట్టడంతో స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు.



శ్రీరామ్‌నగర్ రోడ్డులో ఇలా..

పలు కాలనీల్లో పిక్క, ఇసుక వంటి వాటిని రోడ్డుమీద ఉన్న బోర్లు, కుళాయిల వద్ద వేస్తుండడంతో స్థానికులు తాగునీటిని పట్టుకోవడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. మరికొందరు చీకటి పడిన తరువాత ఇక్కడ సమీపంలో ఉన్న గెడ్డల్లో డెబ్రిస్‌లను పారబోస్తున్నా రు. రోడ్డుమీద గుట్టలుగా పారబోస్తున్న డెబ్రిస్‌ను తొలగించక పోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనసంచార ప్రాంతాలు కావడంతో నిత్యం ఇటుగా వెళ్లే వాహన చోదకులు రాకపోకలు సాగిస్తుంటారు. రహదారిలో నిర్మాణ సామగ్రిపై ద్విచక్ర వాహదారులు జారీ పడుతున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

నడవాలంటే ఇబ్బందులు



రహదారుల్లో ఇంటి నిర్మాణ సామాగ్రి అడ్డదిడ్డంగా వేస్తున్నారు. అటుగా రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. జోనల్ కమిషనర్ దృష్టికి సమస్యను తీసుకెళ్తాం.

– చెంగల ఈశ్వరరావు, ఐటీఐ కూడలి

చర్యలు తీసుకుంటాం



రహదారుల్లో వ్యర్థాలు, నిర్మాణ సామాగ్రి వేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చింది. జోన్ పరిధిలో ఇలాంటి సమస్యలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించాం. ఆయా వార్డుల్లో పర్యటించి నిర్మాణ వ్యర్థాలు వేసే వారిపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే సచివాలయాల టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులకు, టీపీవో అధికారులకు ఆదేశాలు జారీ చేశా.

– ఐవీ రమణమూర్తి, ఏసీపీ జోన్ 5, జ్ఞానాపురం

డీఈవో ఆకస్మిక తనిఖీ

సీతంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో శతశాతం మధ్యాహ్న భోజన పథకం అమలయ్యేలా చూడాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ అన్నారు. జీవీఎంసీ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌ను మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా 6వ తరగతి విద్యార్థుల నోట్‌బుక్స్ పరిశీలించారు. పాఠ్యపుస్తకాలు అందరికీ అందాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఫార్మేటివ్ 4 హిందీ పరీక్షకు సంబంధించి 6వ తరగతి విద్యార్థుల నోట్స్‌లు తనిఖీ చేశారు. ఇద్దరు విద్యార్థులకు హిందీ చదవడం, రావడం లేదని గుర్తించి, ప్రతి విద్యార్థికి హిందీలో శిక్షణ ఇవ్వాలని టీచర్స్‌కు సూచించారు. పదో తరగతి విద్యార్థులు ప్రీ ఫైనల్ పరీక్షలకు ఏవిధంగా ప్రిపేర్ అవుతున్నారు. ప్రిపరేటరీ1,2లలో వచ్చిన ఇంగ్లిష్ మార్కుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ సువర్ణ, ఏపీవో అప్పలనాయుడు, హెచ్‌ఎం బి.లక్ష్మి నరస, సీఆర్‌పీ భాగ్యలక్ష్మి, సీనియర్ ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, పీఈటీ సునంద్ పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

సీతంపేటలో భగవద్గీత ప్రచారం

సీతంపేట: త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక అనకాపల్లి ఆధ్వర్యంలో మంగళవారం సీతంపేటలో భగవద్గీత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగ అధ్యాయంలో 16, 17 శ్లోకాలు త్రైత సిద్ధాంతానికి ఆధారమని, త్రైత సిద్ధాంత భగవద్గీత జ్ఞానం ద్వారా సమాజంలో ఉన్న కులమతాలను రూపుమాపడానికి, ప్రజల మధ్య ఉన్న అసమానతలు తొలగించడానికి సర్వమతాలకు దేవుడు ఒక్కడేనని ప్రజల్లో భక్తిభావం పెంపొందించడానికి దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అప్పలనాయుడు, రావణన్న పాల్గొన్నారు.



సీతంపేటలో భగవద్గీత ప్రచారం చేస్తున్న సమితి ప్రతినిధులు

మహిళా సాధికారత హర్షణీయం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోపి

విశాఖ లీగల్: మహిళలు మార్గదర్శకులుగా ఎదుగుతూ మహిళా సాధికారతను సాధిస్తున్న విధానం హర్షణీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తాల గోపి అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయవాదుల గ్రంథాలయంలో మంగళవారం సాయంత్రం మహిళా న్యాయవాదుల సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు తమ సామర్థ్యాలతో రాణిస్తున్న విధానం అభిలషణీయమన్నారు. వృత్తిపట్ల అంకితభావం, నిరంతరం విధి నిర్వహణలో నిబద్ధతతో ఉన్నత స్థానాలు అధిరోహిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో కుటుంబ న్యాయస్థానం అదనపు జిల్లా న్యాయమూర్తి కె.వాణిశ్రీ, సమాఖ్య అధ్యక్షురాలు డి.మంజులత, బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు కె.రామజోగేశ్వరరావు, సభ్యులు ఎస్.కృష్ణమోహన్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, ఉపాధ్యక్షురాలు బి.ఎస్.లత, కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాదులు పప్పు అనూరాధ, కృష్ణకుమారి, మహిళా ప్రతినిధి కె.ఎల్.డి.నాగశ్రీ, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న న్యాయమూర్తి జి.గోపి

ప్రేమ పేరుతో మోసం

- విశాఖ వాసికి రిమాండ్

పుట్టపర్తి: ప్రేమ పేరుతో అమ్మాయిలకు గాలం వేసి, వారి ఫొటోలు, వీడియోలు తీసి మార్ఫింగ్ చేస్తూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్న విశాఖపట్నానికి చెందిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను బుక్కపట్నం ఎస్‌ఐ నరసింహుడు మంగళవారం వెల్లడించారు. పుట్టపర్తి నియోజకవర్గానికి చెందిన ఓ యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఎస్పీ యశ్వంత్ నేతృత్వంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు విశాఖపట్నం ప్రాంతానికి చెందిన చంద్రమౌళిని సోమవారం అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తాను చేసిన నేరాలను నిందితుడు అంగీకరించాడు. చంద్రమౌళికి ఇదివరకే వివాహమైంది. కళాశాల విద్యార్థినులు పలువురిని ప్రేమ పేరుతో నమ్మించి, వారికి తెలియకుండా ఫొటోలు, వీడియోలు తీసి అసభ్యకరమైన చిత్రాలతో మార్ఫింగ్ చేసేవాడు. అనంతరం వాటిని విద్యార్థినులకు చూపి బ్లాక్‌మెయిల్ చేసేవాడు. కొన్నేళ్లుగా హైదరాబాద్, వైజాగ్, కర్ణాటక తదితర ప్రాంతాల్లో ఈ తరహా మోసాలకు పాల్పడ్డాడు. ఈ క్రమంలో నిందితుడి ఉచ్చులో చిక్కుకున్న పుట్టపర్తి నియోజకవర్గానికి చెందిన యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడి అసలు బాగోతం వెలుగు చూసింది. విచారణ అనంతరం మంగళవారం నిందితుడిని అరెస్ట్ చూపి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.



పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు చంద్రమౌళి

కనక మహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

160 కేజీల గంజాయి పట్టివేత

మర్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి తరలిస్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. పశ్చిమ బంగాకు చెందిన ఐదుగుర్ని అరెస్టు చేశారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఐటీఐ జంక్షన్ వద్ద కాపుగాసి గంజాయి తరలిస్తున్న నిందితులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఐదో పట్టణ సీఐ విజయ్‌కుమార్ సంయుక్తంగా అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 160 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా నుంచి పశ్చిమబంగాకు తరలిస్తున్న అల్లాద్దీన్ షేక్ , అలామిన్ షేక్ , అలేమా బీబీ, షేక్ సయ్‌ఫుల్ , షకీరుల్ ఖాన్ అరెస్టు చేసి, వీరి 6 సెల్ ఫోన్లు, రూ.7వేలు స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా ముత్యాలమ్మ అమ్మవారి పండగ



పూజలు చేస్తున్న భక్తులు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 24 వార్డు నక్కవానిపాలెంలోని ఏడుగుడులు, ముత్యాలమ్మ వారి పండగ ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమ పూజలు చేశారు. ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి పూజల్లో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

క్రికెట్ మ్యాచ్ టికెట్ల కోలాహలం



మున్సిపల్ స్టేడియంలో టికెట్ల కోసం క్యూ

జగదాంబ: ప్రతిష్టాత్మకమైన భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగే ఒక్కరోజు అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్‌కు ముందుగానే విశాఖలో కోలాహలం మొదలైంది. మ్యాచ్ టికెట్ విక్రయాలను మంగళవారం నగరంలో మూడు వేదికల్లో చేపట్టారు. వన్ టౌన్ వెలంపేటలో ఉన్న ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియం వద్ద తెల్లవారుజాము నుంచే క్రికెట్ అభిమానులు బారులు తీరారు. క్రికెట్ మ్యాచ్ టికెట్ల కొనుగోలు కోసం పోటీపడ్డారు. రూ.600, రూ.1500, రూ.2 వేలు, రూ.3 వేలు, రూ.3500, రూ.6వేలు టికెట్ల కోసం అభిమానులు క్యూ కట్టారు.

గెడ్డలోకి దూసుకెళ్లిన కారు

పెదగంట్యాడ: మండలంలోని వినాయనగర్ వుడా కాలనీ కమ్యూనిటీ హాల్ సమీపంలో మంగళవారం ఓ కారు అదుపుతప్పి గెడ్డలోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ఉన్న పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రమేష్‌బాబుకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. వినాయకనగర్ వుడా కాలనీలో గల సీడబ్ల్యూసీలో మంగళవారం నిర్వహించనున్న ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వైద్యాధికారి రమేష్‌బాబు వచ్చారు. ఆ కార్యక్రమాన్ని ముగించుకుని తిరిగి వెళ్లేందుకు ఆయన గెడ్డ పక్కన పార్కింగ్ చేసిన కారును తీస్తుండగా ఒక్కసారిగా కారు ముందుకు వెళ్లిపోయింది. దానిని కంట్రోల్ చేసేలోగా గెడ్డలోకి దూసుకెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆయన స్వల్ప గాయాలతో బయట పడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే అతన్ని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తరలించారు. గెడ్డలో ఉన్న కారును జీవీఎంసీ అధికారులు జేసీబీ సాయంతో బయటకు తీశారు. ఈ ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని న్యూపోర్టు సీఐ రాము తెలిపారు.



గెడ్డలోకి దూసుకెళ్లిన కారు, పక్కన డాక్టర్ రమేష్‌బాబు

సుబ్రహ్మణ్యస్వామి చైత్రపౌర్ణిమకు ఏర్పాట్లు

కంచరపాలెం: చైత్రపూర్ణిమి మహోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 27వ తేదీ నుంచి సుబ్రహ్మణ్యస్వామి చైత్ర శుద్ధ పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు దేవాల రాజుకృష్ణ తెలిపారు. కంచరపాలెం ఊర్వశికూడలి రవీంద్రనగర్ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం వేడుకల కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. కలశ స్థాపన, విఘ్నేశ్వరపూజ, మండపారాధన, ముత్తైదువుల చేతులమీదుగా ఊంజల సేవ ఉంటుందన్నారు. అనంతరం క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు, స్కందవేద హోమం తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 5వ తేదీ సాయంత్రం స్వామి తిరువీధి మహోత్సవం ఉంటుందన్నారు. ఆలయానికి రంగులు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరణ ఏర్పాటు జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాండ్రేగుల రాము, సీహెచ్.కుమారి, కె.రవి, సీహెచ్ సురేష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దేవాల రాజు. కమిటీ సభ్యులు

సీనియర్ సిటిజన్స్‌కు ఘన సత్కారం

మురళీనగర్ : 88....89....90..ఇదేదో లెక్కలు వేసుకునే అకౌంట్ కాదు.. నిత్యం చురుకుగా ఉంటూ తమ జీవన గమనంలో యువతకు ఆదర్శనీయంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ముగ్గురు వాకర్స్ క్లబ్ సభ్యుల వయసుల లెక్కలు. ఇన్నేళ్ల పాటు ఎటువంటి ఇబ్బందులు లేకుంగా వాకర్స్ క్లబ్‌లో వివిధ హోదాల్లో పనిచేస్తూ ప్రస్తుతం ఉన్న సభ్యులకు స్ఫూర్తిగా నిలుస్తున్న వీరిని వాకర్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో రాళ్లపల్లి సత్యనాథం (88), నిమ్మగడ్డ బుచ్చయ్య (89), పి.వి జయానందరావు (90)లను వాకర్స్ క్లబ్ సభ్యుల ఘనంగా సత్కరించారు. పి.విజయానందరావుకు 90వ పుట్టిన రోజు వేడుకలను కేక్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఆయన సమకాలీనికులైన ఆర్.సత్యనాథం, ఎన్.బుచ్చయ్యను సత్కరించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి మాట్లాడుతూ త్రిమూర్తులుగా పేరు పొందిన వీరు వాకర్స్ క్లబ్‌కు, డిస్ట్రిక్ట్–101కు, వాకర్స్ ఇంటర్నేషనల్ కు చేస్తున్న సేవలు కలకాలం గుర్తుండిపోతాయన్నారు. ఇప్పటికీ వీరు తమ పనులను తాము చేసుకుంటూనే వాకర్స్ నిర్వహించే ప్రతి సేవా కార్యక్రమంలోనూ తమ వంతు కీలక పాత్ర వహిస్తున్నారని చెప్పారు. తన పుట్టిన రోజు వేడుకలు వాకర్స్ క్లబ్‌లో జరుపుకోవడం ఆనందంగా ఉందని విజయానందరావు చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్, పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



సీనియర్ వాకర్స్ విజయానందరావు, బుచ్చయ్య, సత్యనాథంలను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

అప్పలరాజుకు స్వర కళా పురస్కారం

సీతంపేట: ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్, అమ్మాజమ్మ సూర్య ప్రకాశరావు మెమోరియల్స్ సంయుక్త ఆధ్వర్యంలో స్వర బ్రహ్మ కేవీ మహదేవన్ జయంతిని పౌరగ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర గాయకుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జామి శివ అప్పలరాజును స్వర కళా పురస్కారంతో అతిథుల చేతుల మీదుగా సత్కరించారు. ఆత్రేయ స్మారక కళాపీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళీధర్ మాట్లాడుతూ జామి శివ అప్పలరాజు కళాకారుల అభ్యున్నతి కోసం నిర్విరామంగా కృషి చేస్తున్నారని అన్నారు. కళాకారుల సంక్షేమం కోసం జీవిత బీమా చెయ్యడంతో పాటు, అనారోగ్య సమస్యలు ఎదురైతే ఇబ్బందులు పడకుండా హెల్త్ కార్డులు కూడా చేయించారన్నారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న కళాకారులకు చేయూత ఇస్తున్నారని తెలిపారు. నిస్వార్థంగా కళాకారులకు సేవలందిస్తున్న అప్పరాజుకు పురస్కారం అందజేయడం హర్షణీయమన్నారు. ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమల రావు మాట్లాడుతూ సంగీతానికి ఎల్లలు లేవని నిరూపించిన గొప్ప సంగీత సృష్టికర్త కేవీ మహదేవన్ అని కొనియాడారు. అనంతరం మహదేవన్ స్వరపరిచిన చిత్ర గీతాలతో నిర్వహించిన స్వర విభావరి అలరించింది. ఈ కార్యక్రమంలో కళా రంగ ప్రతినిధులు ఎస్.ఫణిస్వామి, వి.ఎం. గోపాలరావు, పి.శ్యామ్‌సుందర్, పీలా నీల తిలక్, ఎం.టి.ఆర్.త్రినాథ్, జె.ఎం.ఆర్.నెహ్రూ, గాయనీ గాయకులు మహమ్మద్‌ఖాన్, రాజు. రమణి, బొమ్మిడి సత్యనారాయణ, లిఖిత, సి.వి.రాజేశ్వరి, రామకృష్ణ, జాస్మిన్, అమ్మాజీరావు, నాగలక్ష్మి పాల్గొన్నారు.



శివ అప్పలరాజుకు పురస్కారం అందజేస్తున్న అతిథులు

కేకే–2లైన్‌లో జనరల్ మేనేజర్ తనిఖీలు

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్‌రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ మంగళవారం వాల్తేర్ డివిజన్ పరిధిలోని కేకే –2 (కిరండూల్–కోరాపుట్)లైన్లో డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సెక్షన్ పరిధిలోని సైడింగ్స్, రైల్వే కార్యాలయాలు, రైల్వే స్టేషన్లు, ఎన్‌ఎండీసీ మైనింగ్ సైట్ ప్రాంతాలను తనిఖీ చేశారు. విండో ట్రైలింగ్ తనిఖీల ద్వారా మలుపులు, వంతెనలు, పాయింట్స్ అండ్ క్రాసింగ్స్‌లను పరిశీలించారు. కిరండూల్–జగదల్‌పూర్ సెక్షన్‌లో గల డబ్లింగ్ పనులను, సైడింగ్ పనులను, అమృత్ భారత్ పథకం కింద ఎంపికై అభివృద్ధి చేయాల్సిన స్టేషన్‌లను పరిశీలించారు. కిరండూల్, జగదల్‌పూర్, జైపూర్, కోరాపుట్ స్టేషన్లలో తనిఖీలు చేపట్టి ఆ ప్రాంతాల్లోని ప్రజా ప్రతినిధులు, వివిధ సంస్థల ప్రతినిధులు, మీడియా ప్రతినిధులతో జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ సమావేశమయ్యారు. వారి నుంచి సలహాలు, సూచనలు తీసుకున్నారు.



కోరాపుట్ స్టేషన్‌లో పర్యటిస్తున్న ఈస్ట్‌కోస్ట్‌రైల్వే జీఎం మనోజ్‌శర్మ

రోబోటిక్స్‌లో ఏయూ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ఏయూక్యాంపస్: ఆంధ్రాయూనివర్సిటీ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు రోబోటిక్ పోటీల్లో ప్రతిభ చూపారు. ఇటీవల పుణేలోని శ్రీ శివ ఛత్రపతి శివాజీ స్టేడియంలో నిర్వహించిన ఎఫ్‌టీసీ రోబోటిక్స్ స్టెమ్ టెక్నాలజీ టోర్నమెంట్‌లో పాల్గొని ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో 60 జాతీయ, 11 అంతర్జాతీయ జట్లు పాల్గొన్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొన్న ఏయూ విద్యార్థుల బృందం పుణే, చెన్నై, గుజరాత్ వంటి ఇతర రాష్ట్రాల జట్లతో ఇజ్రాయిల్, రొమేనియా వంటి అంతర్జాతీయ జట్లతో పోటీపడ్డారు. 71 జట్లలో ఏయూ జట్టు 28వ స్థానంలో నిలిచింది. ఏయూ జట్టుకు స్టెమ్ యంగ్ అచీవర్ అవార్డు లభించింది. ఏయూ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులకు రోబోటిక్స్ రంగంలో అవసరమైన శిక్షణ, నైపుణ్యాలను ఎన్‌ఆర్‌ఐలు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రహమాన్, శిరీన్ రహమాన్ దంపతుల కుమారుడు సమీర్ షేక్, సంతోష్ అందించారు. విద్యార్థుల ఆసక్తులు, సామర్థ్యాలకు అనుగుణంగా వారికి ఆన్‌లైన్‌లో శిక్షణ అందిస్తూ వారికి అవసరమైన వనరులు సమాకూర్చారు. ఈ ఘనత సాధించిన విద్యార్థులను చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ శిరీన్ రహమాన్ అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న శిరీన్ రెహమాన్